
# నీ వళ్ళు బంగారం కాను!

రాంపా



కొబ్బరి బోండాల గెల, చీపురు కట్టల కట్ట, విసనకర్రలు వేలాడదీసిన గొడుగు, వడియాలు పెట్టడానికి గుమ్మడికాయలు, మూడు గిర్రల సైకిలు, క్యారం బోర్డు, వేరుశనక్కాయల మూట, కూరగాయల సంచీ ఇంకా ఒకటీ అరా చిన్నాచితకా... అంత బరువునీ ఆపసోపాలు పడుతూ లేస్తూ తెస్తూ వస్తున్న విఠల్‌రావుకి మిత్రుడు శఠగోపం లూనా మీద వస్తూ ఆగి షేకాండిచ్చాడు. చేయి కదిలించే స్థితిలో లేని విఠల్‌రావు శఠగోపం చేతికి వేలు కొద్దిగా తగిలించాడు.

''రైల్వే పోర్టరుగా పనిచేసిన నీ మధురాతి మధుర మదరాసు అనుభవం నీ కొత్తకాపురంలో విడుదల చేయకురా అని నెత్తీనోరూ కొట్టుకొని మరీ చెప్పా'' అన్నాడు శఠగోపం విఠలరావు మోస్తున్న బరువును కలియజూస్తూ.

''చెప్పలేదురా బాబో చెప్పలేదు. మొన్న మా చినమామగారొచ్చారు. వచ్చిన దగ్గర నించీ పెళ్లికి ముందే నిన్నెక్కడో చూశా... ఎక్కడో చూశా అంటూ కుంటుకుంటూ నా వెంట పడ్డాడు.''

''నువ్వాయన్ని గుర్తుపట్టావా!''

''ఆయన టీసీగా వచ్చి కదిలే రైలెక్కబోయి కిందపడితే – ఓ చేత్తో ఆయన్ను భుజం మీద వేసుకొని ఇంకో చేత్తో ఆయన కాలి ముక్కను పట్టుకొని ఆసుపత్రిలో చేర్పించింది నేనేగా – గుర్తుండిపోయాడు''

''సరే అయిందేదో అయింది. నువ్వు జిమ్ పెట్టుకోవడానికి పెట్టిన లోన్ శాంక్షనయింది. డబ్బు చేతికొచ్చి వ్యాయామశాల తెరిచేదాకా ఎవరికీ ఏం చెప్పకు. నీ భార్యక్కూడా'' చెప్పాడు శఠగోపం.

''అయితే పద... ఈ సామాన్లు ఇంట్లోపడేసి అలా బయటకెళ్లి విందు చేసుకుందాం'' అని వెనుక కూర్చోబోయాడు విఠలరావు.

''నిన్నూ నీ సామానునూ నా లూనా లాగునా ముందుకు సాగునా'' అన్నాడు శఠగోపం నవ్వుతూ..

''అరేయ్– ఇది రెండు చక్రాల లారీరా... గుండెల మీద ఏనుగుల్ని మోసే బండిరా'' అంటూ కూర్చుందామని కాలు లేపబోతుంటే బాంబు పేలిన చప్పుడయింది. సామానుతో సహా విరుచుకు పడ్డాడు విఠల్‌రావు.

క్షణంలో జనం గుమిగూడారు.

''ఓస్... ఇంతేనా! టైర్ బరస్టేనా... ఉగ్రవాదుల ఉరుమనుకున్నాం'' అని శ్వాస పీల్చుకొని వెళ్లిపోయారు.

''అరేయ్ దగ్గర్లో పంక్చర్ షాపు లేదు ఎలా... ఏయ్ రిక్షా'' పిలిచాడు శఠగోపం.

''ఈ మాత్రం దానికి రిక్షా ఎందుకురా ! ఈ సామాను నువ్వు పట్టుకురా...నేను నీ లూనా మోసుకొస్తా'' అన్నాడు విఠల్‌రావు లేచి దులుపుకుంటూ సామాను అందుకుంటూ.

''అమ్మో! నా లూనాయే బరువు తక్కువ'' అంటూ లూనాను భుజాన వేసుకున్నాడు శఠగోపం.

***

''మగవాళ్లన్న తరువాత బయట ఎవరో కలుస్తుంటారు. ఏదో మాట్లాడాల్సి వస్తుంది. అయిదు నిమిషాల ఆలశ్యానికే చీపురు కట్టల్లేక ఇల్లంతా మట్టినిండిపోయినట్లు...విస్తరాకుల్లేక మీ బాబాయి నిరాహార దీక్ష చేసి నీరసించిన నాయకుడైనట్లు... విసనకర్రల్లేక శ్వాస ఆగిపోయినట్లు గగ్గోలు పెడుతున్నావు'' ఆగకుండా పెద్దగొంతుతో అరిచి అలసిపోయి ఆయాసపడ్డాడు విఠల్‌రావు. తన ప్రతిభతోనూ... తనస్నేహంతోనూ డబ్బులొస్తున్నాయన్న ధైర్యంతో.

''ఏంటయ్యో! ఏంటి నోరు బారెడు చేసుకుంటున్నావు. ఏంటి సంగతి'' రెట్టించిన గొంతు విప్పింది భార్య వర్ధిని.

వర్ధిని మహిషాసుర మర్ధిని అవుతున్నదని శాంతపరిచే మార్గం వెతుకుతూ–

''శుభవార్త నోట్లో నానుతుంటే మాటలలా ఊరుతూ జారుతుంటాయి మరి'' అని నాలుక్కరుచుకున్నాడు విఠల్‌రావు.

విఠల్‌రావు మనసుని పట్టేసిన వర్ధిని వరస మార్చింది వెంటనే.....

''అదేదో నిజంగానే శుభవార్తయుంటుంది. ఏంటో చెప్పండి'' అడిగింది లాలనగా...

''నువ్వలా అండీ...అండీ అంటుంటే గంధర్వ గానంలో హాయిగా తేలిపోతున్నట్టున్నదోయ్'' అన్నాడు విఠల్‌రావు తన మాటకి మద్దతుగా శరీరాన్ని కదిలిస్తూ...

''సరే గాన కచేరీ ఏర్పాటు చేస్తాగానీ... ఏంటో చెప్పండి'' గడ్డం పట్టుకుని భుజం మీద చేయి వేస్తూ.

''ఏంటండీ! అల్లుడుగారూ మీ సంతోషం మా సంతోషమేగా నాక్కూడా పంచండి అదేంటో'' అంటూ వచ్చాడు చి.మా.గా...

''ఏం లేదండీ కాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది అమెరికాలో''మాట మారుస్తూ అన్నాడు విఠల్‌రావు.

''ఇప్పుడే విమానం దిగివచ్చినట్లు చెబుతున్నారే'' అన్నాడు చి.మా.గా.

''ఆ డాక్టర్ని వెంటనే పంపిస్తానని జార్జిబుష్ చెప్పాడండీ'' అన్నాడు విఠల్‌రావు.

''ఎప్పుడు చెప్పారో'' అన్నాడు చి.మా.గా.

''ఆయన మొన్న హైదరాబాద్ వచ్చినప్పుడు ఈయన బొమ్మలాగా శిల్పారామంలో నించున్నప్పుడు చెప్పాడ్లే...బాబాయ్'' అంది వర్ధిని.

''చాల్లే! మామా అల్లుళ్ల ముచ్చటైన ముచ్చట్ల ప్రయాణంలో తమరు తల దూరిస్తే టికెట్ ప్లీజ్ అంటారు చి.మా.గారు''అన్నాడు విఠల్‌రావు.

''లేదండీ! కూలీ కూలీ అంటానండీ'' అన్నాడు చి.మా.గా.

కుప్పకూలిపోయాడు విఠల్‌రావు.

***

అప్పుగా అయితేనేం శుభమా అంటూ లక్ష్మీదేవి ఇంటికొస్తే ఇనుప వస్తువులు కొనటమేమిటండీ అని సెంటిమెంటు చెప్పి వళ్లు బంగారం చేసుకున్నావు. ఇప్పుడు బ్యాంకు వాళ్లొస్తున్నారు. నేనేం చూపించాలి. జిమ్మేదంటే ఏం చెప్పాలి వాళ్లకి''విలవిల్లాడాడు విఠల్‌రావు.

''పెట్టారుగా బోర్డు–వాయునందన వ్యాయామశాల. అని అవి చూపించండి చాలు. కోట్లకు కోట్లు మింగి కోటలు కట్టిన వాళ్లనే పట్టించుకోని వాళ్లు కాయ కష్టం చేసి కండలు పెంచే వాళ్లనేం చేస్తారులెండి'' అంది వర్ధిని.

''సరే ఇప్పుడేం చేద్దాం'' ఆదుర్దాగా అన్నాడు విఠల్‌రావు.

''బుడ్డోడు చిన్నప్పుడు ఊగిన ఉయ్యాల. మానాన్న చివరి రోజుల్లో పడుకున్న మడత మంచం వేద్దామండి''


''కరెక్టేలే వ్యాయామానికి గాలి కావాలి కదా... నవ్వాలో ఏడవాలో తెలియక అన్నాడు విఠల్‌రావు.


''ఊగితే వచ్చేది గాలే కదా'' నవ్వుతూ అంది వర్ధిని.

''ఏంట్రా ఏవో గాలి మాటలు మాట్లాడుకుంటున్నారు'' అంటూ వచ్చాడు శఠగోపం.

వచ్చినవాణ్ణి వచ్చినట్లే డాబా మీదకి తీసికెళ్లాడు విఠల్‌రావు.

డాబా మీద చాలా సేపు మౌనంగా వున్నాడు






శరగోపం.

"ఏం చేయనురా మా ఆవిడ నాకు మనశ్శాంతి లేకుండా చేసింది"గోడు చెప్పుకున్నాడు విఠల్‌రావు.

"మనశ్శాంతి...గినశ్శాంతి అనకు ఇంటిని కుదవబెట్టి తీసుకున్న అప్పు రేపు పెద్దదయితే ఇంటినే మింగేస్తుంది. మహా అయితే కోర్టుకి వెళ్తారు అంతేగా అనుకోకు"గట్టిగా చెప్పాడు శరగోపం.

"ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పరా" వేదనగా అడిగాడు విఠల్‌రావు.

"చెప్పింది చేయలేదు. చేసింది ఇప్పుడు చెప్పావు. ఇక నేను చెప్పేదేంటీ నువ్వు చేసేదేంటీ. అప్పు హెవీ వెయిట్-నీ ఇష్టం" లేచి వెళ్లబోయాడు శరగోపం.

కాళ్లావేళ్లాపడ్డాడు విఠల్‌రావు.

"పోతే పోయింది. నా ఇల్లు నా వంటి మీద బంగారం మాత్రం నేనొదలను. ఇది మానాన్న ఇచ్చిన ఇల్లు. అది గుర్తుంచుకొని మాట్లాడండీ" అంది వర్ధిని.

" ఇలా వితండంగా మాట్లాడితే ఎలాగోయ్ పరిస్థితి చేయి జారిందంటే నవ్వు నన్ను కాపాడలేవు. నేను నిన్ను కాపాడలేను. పిల్లవాడు పెరుగుతున్నాడు. రేపు నీవు నన్ను అనకుండా ముందే చెబుతున్నా నీ ఇష్టం" అన్నాడు పక్కకు తిరిగి పడుకుంటూ.

***

"దొంగ!దొంగ!" అరిచింది వర్ధిని అర్ధరాత్రి.

వర్ధిని నోట్లో గుడ్డలు కుక్కి చేతులు వెనక్కి తిప్పి కట్టేశాడు దొంగ.

విఠల్‌రావుని కూడా కత్తితో దడిపించి అంతే కట్టిపడేశాడు.

"మగవాడికి ఇంకో మగవాడు దిక్కున్నట్లు వుండేవాడివి. వుండీ వుండీ రాత్రే ఎక్కడ తగలడ్డావు బాబాయ్!నిలువు దోపిడీ అయింది బాబోయ్!

అమ్మేసి అప్పు తీర్చినా పోయేది. బావురుమంది వర్ధిని.

"ఇప్పుడంతే అనిపిస్తుంది. నేనడిగినప్పుడు తీసి ఇచ్చుంటే బావుండేది కదా" అవకాశం తీసుకొని ఓ మాటనేశాడు విఠల్‌రావు.

"ఏం బావుండేది తీసి బీరువాలో పెట్టేవారు. దొంగోడు బీరువా కూడా ఎత్తుకెళ్లేవాడు" అంది.

"బంగారం పోతే పోయింది. ఇనుప ముక్కయినా దక్కిందంటావా?"అన్నాడు విఠల్‌రావు.

"అదే అయిందిగా" అన్నాడు చి.మా.గా.

"అదీ ఇదయిందని కాదు ఇప్పుడవ్వాల్సిందేమిటని"అంది వర్ధిని.

"ఏంటడల్లుడుగారూ వ్యాయామశాల పేరుచెప్పి ఇంతెత్తు కండలు పెంచారు. చేతికందిన దొంగని వదిలేశారు" అన్నాడు చిమాగా.

"కత్తికి కండ లోకువేగా చిమాగారూ" అన్నాడు విఠల్‌రావు.

"కండలట కండలు బండలు మోయడానికి తప్పితే ఎందుకూ పనికిరావు" ఈసడించింది వర్ధిని.

"నాకు భగవంతుడిచ్చిన విద్య బరువులు మోయడం ఒక్కటే ఏం చేస్తాం" అన్నాడు విఠల్‌రావు.

"అందులోనే ఏదన్నా నేర్పు సాధించి పోటీల్లోకి వెళ్లొచ్చుగా" అంది వర్ధిని.

"నిజమే మరి కరణం మల్లీశ్వరి కుంజరినీ దేవి అంతంత బరువులు మోయడం ఎంత విశేషం" అన్నాడు చిమాగా.

"బరువుల్లేపడంలో ఆడవాళ్లదే పై చేయి చూడండి మా భూదేవి ఎంత బరువు మోస్తున్నదో"

"ఆ మాటకొస్తే ఆ భూదేవినే ముక్కుమీద నిలిపాడు మా విష్ణుమూర్తి" గొప్పగా అన్నాడు విఠల్‌రావు.

"ఇక చాల్లెండి రైలుస్టేషన్ బుక్‌స్టాల్లో పురాణాలు బాగానే వంటబట్టించుకున్నారు" అంది వర్ధిని.

***

"ఇప్పటికీ నాకు అంతుచిక్కని విషయం ఒకటుందండీ. ఆ దొంగ వెధవ తన డైలాగులన్నీ టేపులో వినిపించాడేమిటా అని" అంది వర్ధిని.

"మూగదొంగ అయ్యుంటాడు పాపం" అన్నాడు చిమాగా.

"దొంగ దొంగ అయ్యుంటాడు" అంది వర్ధిని.

"అదేమిటమ్మాయ్!" అన్నాడు చిమాగా.

"నేను గోల్డు మెడవంచనని బంగారు నగలు ఇవ్వనని మొండికేశానని వాడికెలా తెలిసిందని" అంది.

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" ఆందోళనగా అడిగాడు చిమాగా.

"ఏమండేమండీ దొంగ దొంగెవరో చెప్పరూ ప్లీజ్" ముద్దుగా అడిగింది వర్ధిని.

"నగలు పోయిన షాకులో వర్ధిని మెదడుకేమన్నా అయ్యుంటుందంటారా" చిమాగాని అడిగాడు విఠల్‌రావు.

"లేకపోతే నేను చెబుతా" అంది వర్ధిని.

"సరే చెప్పు ఆ దొంగ వెధవని నాలుగుతన్ని నీ బంగారం నీకిప్పిస్తా" అన్నాడు విఠల్‌రావు.

"మీరు తన్నలేరు" అంది వర్ధిని.

"ఒక్క సన్నాసిగాణ్ణి నేను తన్నలేకపోవడమేమిటి?" అన్నాడు కండలు చూపిస్తూ విఠల్‌రావు.

"ఆ పని రాత్రే ఎందుకు చేయలేకపోయారు?" అడిగింది వర్ధిని.

"అది రాత్రి కాబట్టి వాడి చేతిలో కత్తి వుంది కాబట్టి. వాడి వెనక ఎంత మంది వచ్చారోనన్న భయం కాబట్టి" అన్నాడు విఠల్‌రావు.

"వాడు మీ శరగోపం కాబట్టి" అంది వర్ధిని చిలిపిగా చూస్తూ.

"జోకా?" అనుమానంగా చూస్తూ అన్నాడు విఠల్‌రావు.

"నాకు తెలిసిపోయిందిలెండి మీ శరగోపంతో నాకు శరగోపం పెట్టించారని" అంది ముగింపు పలుకుతూ వర్ధిని.

"ఆఁ!" అని చిమాగాను చూస్తూ పడిపోయాడు విఠల్‌రావు.

విఠల్‌రావు మొహం మీద నీళ్లు చల్లింది వర్ధిని.

తేరుకుని వర్ధినిని చిమాగాను తేరిపార చూస్తున్నాడు విఠల్‌రావు.

"వెధవ నగలు అమ్మి బ్యాంకు అప్పు తీర్చేసి కోర్టుదాకా వెళ్లకుండా చేయండి ప్లీజ్" అంది వర్ధిని.

ఈసారి వంటి మీద నీళ్లు గుమ్మరించినా లేవకుండా పడిపోయాడు విఠల్‌రావు గావు కేక పెట్టి.